# మేడిగడ్డ బాధ్యత ప్రభుత్వానిదే

- కేసీఆర్ ఆదేశాలతోనే మేడిగడ్డ యాత్ర చేపట్టాం
- ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీది దివాలాకోరు రాజకీయం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కడియం శ్రీహరి
- 'చలో మేడిగడ్డ'లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్



'చలో మేడిగడ్డ'లో భాగంగా అన్నారం బరాజ్ వద్ద 'కాళేశ్వరంపై కాంగ్రెస్ విషప్రచారం.. బీఆర్ఎస్ వాస్తవాలు' పేరిట పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హైదరాబాద్, మార్చి1 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజలకు అద్భుత ఫలితాలను ఇస్తుందని, మరమ్మతులు చేస్తే రైతులకు మరిన్ని ఫలితాలు చేకూరుతాయని, ఆ దిశగా రాష్ట్రప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ 'చలో మేడిగడ్డ' యాత్రలో భాగంగా అన్నారం బరాజ్ వద్ద 'కాళేశ్వరంపై కాంగ్రెస్ విషప్రచారం.. బీఆర్ఎస్ వాస్తవాలు' పేరిట పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని దీటుగా తిప్పికొట్టారు. కాంగ్రెస్ లేవనెత్తిన ప్రతి అంశానికి సోదాహరణంగా వివరణ ఇచ్చారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రీడిజైనింగ్ ఆవశ్యకత, కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని అంశాల వారీగా విశదీకరించారు. ప్రాజెక్టు అంచనా వ్యయం ఎందుకు పెరిగింది? ఎలా పెరిగింది? రిజర్వాయర్ల సామర్థ్యం ఎందుకు పెంచాల్సి వచ్చింది.. అన్న అంశాలను సోదాహరణంగా తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాధించిన విజయాలను, సాగు నీరందిన ఆయకట్టు తదితర గణాంకాలను వెల్లడించారు. కాళేశ్వరంతో 20 లక్షల 33 వేల 572 ఎకరాలకు సాగునీరు అందిందని, ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమైందని కడియం శ్రీహరి తెలిపారు. అంచనా వ్యయం పెరిగిందని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అర్థరహితమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు సాగు నీటి కష్టాలు వచ్చాయని, ఇలాగే ఉంటే ఇంకో నెలలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని హెచ్చరించారు.

### గత ఐదేండ్లలో వరుసగా సాగునీరిచ్చిన బీఆర్ఎస్ సర్కారు

ఈసారి వానలు లేవని కాంగ్రెస్ వారు అంటున్నారని, గత ఐదేండ్లలో ఎప్పుడూ ఇబ్బంది లేకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం సాగు నీరు ఇచ్చిందని కడియం శ్రీహరి తేల్చి చెప్పారు. మేడిగడ్డపై కాంగ్రెస్ పార్టీ దివాళాకోరు రాజకీయం చేస్తున్నదని, రాజకీయంగా కాంగ్రెస్‌ను ఎలా ఎదుర్కోవాలో బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు బాగా తెలుసని చెప్పారు. మేడిగడ్డ బరాజ్‌ను వెంటనే పునరుద్ధరించాలని, వాన కాలంలో వచ్చే వరదలకు మేడిగడ్డ బరాజ్‌కు ఏదైనా అయితే రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యతని స్పష్టం చేశారు. మేడిగడ్డ బరాజ్‌పై ఎలాంటి విచారణకైనా బీఆర్ఎస్ సిద్ధమేనని, బాధ్యులపై ఎలాంటి చర్యలైనా తీసుకోవచ్చని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో కొన్ని పిల్లర్లు కుంగిపోయాయని, దీంతో గత ప్రభుత్వంపై రాజకీయ దాడి చేయాలని కాంగ్రెస్ చూస్తున్నదని, అసలు ఆ నిర్మాణమే పనికి రాదన్నట్టు కాంగ్రెస్ వ్యవహరిస్తున్నదని కడియం ధ్వజమెత్తారు. కేసీఆర్ ఆదేశాల మేరకే తాము ప్రాజెక్టును సందర్శించామని, వాస్తవాలను ప్రజలకు చెప్పాలన్న ఆయన ఆలోచనతోనే మేడిగడ్డకు తరలివచ్చామని చెప్పారు. బీఆర్ఎస్ మేడిగడ్డ యాత్రకు పోటీగా కావాలనే కాంగ్రెస్ నేతలు పాలమూరు పర్యటన పెట్టుకున్నారని, తాము వాస్తవాలు చెప్పడానికి వస్తున్న తరుణంలోనే వారు రాజకీయ యాత్రలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు.

### 'కేంద్రం వద్దే తేల్చుకోండి'

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): ఏపీ రాష్ట్రం గోదావరి నదీ జలాల పంపిణీ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం వద్దే తేల్చుకోవాలని తెలంగాణ సర్కారు స్పష్టం చేసింది. శుక్రవారం జీఆర్ఎంబీ చైర్మన్ ఎంకే సిన్హా అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గోదావరి నదీజలాల పంపిణీ కోసం ప్రత్యేకంగా ట్రిబ్యునల్ వేయాలని ఏపీ కోరగా.. తెలంగాణ అధికారులు అభ్యంతరం తెలిపారు. అంతర్రాష్ట్ర నదీజలాల వివాద చట్టం ప్రకారం ఏపీ ఈ అంశాన్ని కేంద్రం వద్దే తేల్చుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. జీఆర్ఎంబీకి విభజన చట్టం ప్రకారం వచ్చిన అధికారాలకే పరిమితం కావాలని తేల్చి చెప్పారు. ఈ అంశాన్ని పక్కనపెడుతున్నట్టు బోర్డు చైర్మన్ ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లో టెలిమెట్రి కేంద్రాలు పెట్టాలనే ప్రతిపాదనలను వ్యతిరేకించారు. అంతర్రాష్ట్ర సరిహద్దులోనే టెలిమెట్రిలు పెట్టాలని సూచించారు. వీటిని జాతీయ హైడ్రాలజీ కింద ఏర్పాటుచేయాలని కోరారు. ఇందిరమ్మ ఫ్లడ్ ఫ్లో కెనాల్, ఎస్సారెస్పీ-2 విస్తరణ, ఎల్లంపల్లిపై శ్రీపాద ఎత్తిపోతల, కాళేశ్వరం అదనపు టీఎంసీ, కుప్టి పథకాలపై ఏపీ అభ్యంతరం వ్యక్తం చేయగా.. గోదావరిలో న్యాయమైన వాటా ప్రకారమే వీటిని చేపట్టామని వివరించారు.


అన్నారం బరాజ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఎస్ఈ వెంకటేశం

## రాష్ట్రానికి మేడిగడ్డ శరణ్యం

- మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- ప్రభుత్వం అందరితో చర్చించి చర్యలు తీసుకోవాలి
- నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఎస్ఈ వెంకటేశం


కాళేశ్వరం, మార్చి 1 : మేడిగడ్డ ప్రాజెక్టు రాష్ట్రానికి శరణ్యమని, ఇంజినీర్లు ఎంతో శ్రమించి డిజైన్ చేసి నిర్మించారని నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఎస్ఈ వెంకటేశం అన్నారు. ప్రాజెక్టు వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందిందంటే అందులో ఇంజినీర్లది క్రియాశీలక పాత్ర ఉంటుందన్నారు. సమైక్య పాలనలో జరిగిన నీటి దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని, మన రాష్ట్రంలో ఉన్న నీటిని మనమే వినియోగించుకోవాలని కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేసినట్టు పేర్కొన్నారు. గోదావరిలో సంవత్సరంలో 950 టీఎంసీల నీరుంటుందని, ప్రాణహిత నదికిపైన ఉన్న నదులతో కలిపి మేడిగడ్డ దగ్గర నీటి లభ్యత ఉంటుందని సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ బరాజ్‌లో 87 పిల్లర్లుండగా కేవలం మూడు మాత్రమే కుంగాయని, ఇది పెద్దదేం కాదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆలస్యం చేయకుండా మరమ్మతు పనులను పూర్తి చేయాలని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో కమిటీ వేసి, నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు.

# కాళేశ్వరం సమగ్ర స్వరూపం

### కాళేశ్వరం అంటే...

- 3 బ్యారేజీలు
- 15 రిజర్వాయర్లు
- 19 సబ్ స్టేషన్లు
- 21 పంప్ హౌజులు
- 203 కిలోమీటర్ల సొరంగాలు
- 1531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్స్
- 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్
- 141 టిఎంసీల స్టోరేజ్ కెపాసిటీ
- 530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్
- 240 టిఎంసీల నీటి వినియోగం

ఇదీ.. కాళేశ్వరం సమగ్ర స్వరూపం



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న కడియం శ్రీహరి

### మహారాష్ట్ర సీఎంగా పృథ్వీరాజ్ చవాన్ లేఖ

- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు వల్ల 125 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వల్ల గడ్చిరోలి- చంద్రాపూర్ జిల్లాల్లోని 22 గ్రామాలకు చెందిన 2,099 హెక్టార్ల భూమి ముంపునకు గురవుతుంది.
- ఈ ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వం ఏకపక్ష ప్రణాళికల వల్ల చేస్తున్న ఖర్చు.. ఫలితం లేని వ్యయంగా మారుతుంది
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహారాష్ట్ర అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డికి రాసిన లేఖ

### ఆంధ్రప్రదేశ్ సీఎంగా కిరణ్ కుమార్ రెడ్డి లేఖ


ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు విషయంలో మహారాష్ట్ర లేవనెత్తిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని, అంతర్ రాష్ట్ర ఒప్పందాలకు అనుగుణంగానే ముందుకు వెళ్తామని హామీ ఇస్తూ.. అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి మహారాష్ట్ర సీఎంకు లేఖ రూపంలో ఇచ్చిన సమాధానం.

### ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఒప్పందం

- 8 మార్చ్ 2016న తెలంగాణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు నీటి విధానాలు, ప్రయోజనాల కోసం MOU చేసుకొన్నారు
- టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్, రాజకీయ స్థాయిలో సమస్యల పరిష్కారం కోసం మూడు అంచెల సంస్థాగత యంత్రాంగం ఏర్పాటు

### కేంద్ర ప్రభుత్వం నుంచి కాళేశ్వరం ప్రాజెక్టుకు లభించిన అనుమతులు

- కేంద్రంలో, మహారాష్ట్రలో, ఏపీలో కాంగ్రెస్ అధికారంలో ఉండి కూడా ఏడేండ్ల కాలంలో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు ఒక్క అనుమతి కూడా సాధించలేదు.
- కానీ కేసీఆర్ ప్రభుత్వం ఒకే ఏడాదిలో కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులు సాధించింది



### కేంద్ర జల సంఘం సూచనలు

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో ప్రతిపాదించిన జలాశయాల సామర్థ్యం తగినంతగా లేదని, కాబట్టి ప్రాజెక్టు అవసరాలకు తగినంతగా జలాశయాల సామర్థ్యాన్ని పెంచుకోవాలని, కొత్త జలాశయాలు నిర్మించుకోవాలని కేంద్ర జల సంఘం సూచనలు..

### ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రీ-ఇంజనీరింగ్‌కు కారణాలు.. అంతర్ రాష్ట్ర అంశాలు

- తుమ్మిడిహట్టి బ్యారేజి వద్ద చాప్రాల్ వైల్డ్ లైఫ్ ప్రాజెక్టు పరిధి ముంపునకు గురికావడం.
- తుమ్మిడిహట్టి వద్ద ప్రతిపాదించిన, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రలో 3,786 ఎకరాల భూమి ముంపునకు గురవుతుందని మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరాలు చెప్పడం.
- ముంపు లేకుండా ఉండేందుకు, ఎస్ఆర్ఎల్ ను 152 మీటర్ల నుంచి 148 మీటర్లకు తగ్గించాలని మహారాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు వినతులు చేయడం.
- రెండు రాష్ట్రాలు నిర్వహించిన ఉమ్మడి సర్వేల్లో ఎఫ్ఆర్ఎల్ ను 148 మీటర్లకు తగ్గించడం వల్ల 285 ఎకరాలు మాత్రమే ముంపునకు గురవుతున్నట్టు తేలడం.
- గత కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఏడేండ్ల తర్వాత కూడా ఎలాంటి పనులు ప్రారంభించకపోవడం.
- 2007 నుంచి 2014 వరకు ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఎలాంటి ఒప్పందాలు చేసుకోకపోవడం. సెంట్రల్ వాటర్ కమిషన్ నుంచి ఎలాంటి అనుమతులు పొందకపోవడం.

### మంత్రులు హరీశ్ రావు, ఈటెల రాజేందర్, తుమ్మల నాగేశ్వర్ రావులతో కూడిన క్యాబినెట్ సబ్-కమిటీ రిపోర్ట్

గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను సమర్థంగా వినియోగించుకొనేందుకు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చాలని సూచిస్తూ మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదిక అంశాలు.

### ఇప్పటివరకు కాళేశ్వరం నీళ్లతో జరిగిన కొత్త ఆయకట్టు సాగు

- కాళేశ్వరం ద్వారా నేరుగా 98,570 ఎకరాలు.
- కాళేశ్వరం ప్రాజెక్టు కాలువల ద్వారా నింపిన 456 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా 39,146 ఎకరాలు కొత్త ఆయకట్టు.
- కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో ఎస్సారెస్పీ స్టేజ్-1, ఎస్సారెస్పీ స్టేజ్-2, నిజాంసాగర్ నీటితో నింపిన 2,143 మీడియం ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా 1,67,050 ఎకరాలు కొత్త ఆయకట్టు.

**మొత్తం 3,04,766 ఎకరాలు కొత్త ఆయకట్టుకు నీళ్లు.**



### ఆయకట్టు స్థిరీకరణ

- ఎస్సారెస్పీ-1 (ఎల్ఎండీ), ఎస్సారెస్పీ స్టేజ్ -2, నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లకు కాళేశ్వరం నీళ్లు అందించి 17,08,230 ఎకరాల స్థిరీకరణ.
- కాళేశ్వరం నీళ్లు కూడెల్లి వాగు, హల్దీ వాగుల ద్వారా 66 చెక్ డ్యామ్‌లతో మరో 20,576 ఎకరాలకు సాగునీరు.

**మొత్తం 20,33,572 ఎకరాలకు కాళేశ్వరం నీళ్లు.**

### నీటి లభ్యత అంశాలు

- తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతపై సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) హైడ్రాలజీ విభాగం వారు కట్టిన లెక్కల ప్రకారం, తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు అవసరాలకు తగినన్ని నికర జలాలు లేవని, కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణంపై పునరాలోచన చేసుకోవాలని సూచించడం.
- గోదావరి బేసిన్ లోని తెలంగాణ వాటా జలాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొనేందుకు ప్రత్యామ్నాయ ప్రాంతం మేడిగడ్డ వద్ద 284.30 టీఎంసీల నీటి లభ్యత ఉందని గుర్తించడం.

**రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం..**

- ప్రాజెక్టులో ప్రతిపాదించిన జలాశయాల సామర్థ్యం తగినంతగా లేదని, కాబట్టి ప్రాజెక్టు అవసరాలకు జలాశయాల సామర్థ్యాన్ని పెంచుకోవాలని, కొత్త జలాశయాలు నిర్మించుకోవాలని కేంద్ర జల సంఘం సూచనలు చేయడం.
- సమగ్ర అధ్యయనం తర్వాత, ప్రాజెక్టు అవసరాలకు అనుగుణంగా రిజర్వాయర్ల సామర్థ్యం పెంపు, కొత్తవి ఏర్పాటు వల్ల రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యం 16.43 టిఎంసీల నుంచి 141 టీఎంసీలకు పెరగటం.

### రెండు ప్రధాన విభాగాలుగా ప్రాజెక్టు రీ ఇంజనీరింగ్

**డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత ప్రాజెక్ట్**

- 20 టీఎంసీలను మళ్లించి, ఆదిలాబాద్ జిల్లాలో 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూపొందించిన ప్రాజెక్టు.

**కాళేశ్వరం ప్రాజెక్ట్**

- మేడిగడ్డ వద్ద బ్యారేజ్ నిర్మాణం, మేడిగడ్డ, ఎల్లంపల్లి మధ్య మరో రెండు బ్యారేజీలు అన్నారం, సుందిళ్ల నిర్మించడం. కెనాల్స్, టన్నెళ్లు, లిఫ్ట్ సిస్టం, రిజర్వాయర్లు, డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ ద్వారా గతంలో ప్రతిపాదించిన 16.40 లక్షల ఎకరాలకు బదులుగా 19.63 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడం.
- ఎస్సారెస్పీ, నిజాంసాగర్, సింగూరు, వరద కాల్వ, చెరువులు, చెక్ డ్యాంల కింద 18.82 లక్షల ఆయకట్టు స్థిరీకరణ.

**కొత్త ఆయకట్టు, స్థిరీకరణ ద్వారా మొత్తం 38.45 లక్షల ఎకరాలకు సాగు నీరు.**

### ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు సవాళ్లు- సమస్యలు

- తుమ్మిడిహట్టి వద్ద ప్రతిపాదించిన, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రలో 3,786 ఎకరాల భూమి ముంపునకు గురవుతుందని మహారాష్ట్ర అభ్యంతరాలు వ్యక్తం చేయడం.
- తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతపై సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) హైడ్రాలజీ విభాగం వారి లెక్కల ప్రకారం, తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు అవసరాలకు తగినన్ని నికర జలాలు లేవని, కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణంపై పునరాలోచన చేసుకోవాలని సూచించడం.
- ప్రాజెక్టులో ప్రతిపాదించిన జలాశయాల సామర్థ్యం తగినంతగా లేదని, కాబట్టి ప్రాజెక్టు అవసరాలకు తగినంతగా జలాశయాల సామర్థ్యాన్ని పెంచుకోవాలని, కొత్త జలాశయాలు నిర్మించుకోవాలని కేంద్ర జల సంఘం సూచనలు చేయడం.

- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు అవసరాలకు తగినంత నీటి లభ్యత తుమ్మిడిహట్టి వద్ద లేదు అని (18/02/2015) న సీడబ్ల్యూసీ తెలిపింది.
- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు అవసరాలకు తగినంత నీటి లభ్యత తుమ్మిడిహట్టి వద్ద లేదు. భవిష్యత్తులో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. కాబట్టి నీటి లభ్యత విషయంలో సమీక్ష జరపాలి (04/03/2015)

### రీ-ఇంజనీరింగ్‌తో గోదావరి నది సజీవం

| జలాశయం | నీటినిల్వ (టీఎంసీ) | బ్యాక్ వాటర్ (కి.మీ) |
|---|---|---|
| శ్రీరాం సాగర్ | 80 | 74 |
| సదర్‌మాట్ బ్యారేజీ | 1.58 | 17 |
| ఎల్లంపల్లి బ్యారేజీ | 20 | 36 |
| అన్నారం బ్యారేజీ | 10.87 | 32 |
| సుందిళ్ల బ్యారేజీ | 7.24 | 31 |
| మేడిగడ్డ బ్యారేజీ | 16.17 | 42 |
| తుపాకులగూడెం బ్యారేజీ | 6.94 | 30 |
| దుమ్ముగూడెం ఆనకట్ట | 1.3 | 12 |
| మొత్తం | 144.10 | 274 |

### పెరిగిన ప్రాజెక్టుల అంచనా విలువలు

| ప్రాజెక్టు | తొలి అంచనా/సం | మొదటి సవరణ/సం | రెండవ సవరణ/సం | మూడవ సవరణ/సం | శాతం |
|---|---|---|---|---|---|
| నాగార్జునసాగర్ | 122/(1954) | 163.54/(1968) | 312.47/(1974) | 1183.94/(2000) | 970% |
| శ్రీరాంసాగర్ | 40.13/(1964) | 1519.15/(1992) | 4300/(1997) | – | 10,175% |
| జూరాల | 70/(1980) | 204.75/(1985) | 1240/(2008) | 1815/(2016) | 2,592% |
| పులిచింతల | 565.87/(2003) | 681.604/(2005) | 1281.00/(2009) | 1816.17/(2014) | 320% |
| సింగూర్ | 29.25/(1975) | 42.34/(1979) | 104.36/(1989) | 169.12/(1991) | 570% |
| ఎల్లంపల్లి | 900/(2004) | 1366.92/(2013) | 2048.28/(2016) | – | 570% |

### 2014-23 మధ్య స్వరాష్ట్రంలో సాగునీటి కల్పన.. కొత్త ఆయకట్టు

| | | |
|---|---|---|
| మేజర్ ఇరిగేషన్ | : | 14.46 లక్షల ఎకరాలు |
| మీడియం ఇరిగేషన్ | : | 0.59 లక్షల ఎకరాలు |
| మైనర్ ఇరిగేషన్ | : | 0.60 లక్షల ఎకరాలు |
| టీఎస్ఐడీసీ | : | 1.58 లక్షల ఎకరాలు |
| మొత్తం కొత్త ఆయకట్టు | : | 17.24 లక్షల ఎకరాలు |
| స్థిరీకరించిన ఆయకట్టు | : | 31.50 లక్షల ఎకరాలు |

**2014-23 మధ్య రాష్ట్రంలో కొత్త, స్థిరీకరించిన మొత్తం ఆయకట్టు 48.74 లక్షల ఎకరాలు**

ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసిన నివేదిక ఆధారంగా కాళేశ్వరం ప్రాజెక్టు ఆయకట్టు వివరాలు. కాళేశ్వరం కింద నూతన, స్థిరీకరించిన మొత్తం ఆయకట్టు 20,33,572

### ఉమ్మడి పాలనకు, స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనకు ఇదీ తేడా..

**2004-14 మధ్య కేవలం 5.71 లక్షల కొత్త ఆయకట్టు రాగా, 0.93 లక్షల ఆయకట్టును స్థిరీకరించారు. మొత్తం కొత్త, స్థిరీకరణ ఆయకట్టు కలిపితే 6.64 లక్షల ఎకరాలు.**

**2014-23 మధ్య 17.24 లక్షల కొత్త ఆయకట్టు రాగా, 31.50 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. మొత్తంగా కొత్త, స్థిరీకరణ ఆయకట్టు కలిపితే 48.74 లక్షల ఎకరాలు.**

### ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి కల్పన - వివరాలు

1956 నాటికి.. కొత్త ఆయకట్టు:

**16.03 లక్షల ఎకరాలు**

**1956 నుంచి 2004 మధ్య..**

| | | |
|---|---|---|
| మేజర్ ఇరిగేషన్ | : | 19.01 లక్షల ఎకరాలు |
| మీడియం ఇరిగేషన్ | : | 1.91 లక్షల ఎకరాలు |
| మైనర్ ఇరిగేషన్ | : | 12.03 లక్షల ఎకరాలు |
| టీఎస్ఐడీసీ | : | 3.18 లక్షల ఎకరాలు |
| మొత్తం | : | 36.13 లక్షల ఎకరాలు |


**2004 నుంచి 2014 వరకు**

| | | |
|---|---|---|
| కొత్త ఆయకట్టు | : | 5.71 లక్షల ఎకరాలు |
| స్థిరీకరించిన ఆయకట్టు | : | 0.93 లక్షల ఎకరాలు |

**1956 నుంచి 2014 వరకు కొత్త, స్థిరీకరించిన ఆయకట్టు 42.77 లక్షల ఎకరాలు**



### వ్యవసాయరంగం అభివృద్ధి




**ధాన్యం కొనుగోళ్లు**

2014-15లో
24.3 లక్షల మెట్రిక్ టన్నులు

2020-21లో
1.41 కోట్ల మెట్రిక్ టన్నులు

పెరుగుదల శాతం
483.33 శాతం